సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 11 । జూన్ । 2023

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

జిల్లా వ్యాప్తంగా 3,154 కేసుల పరిష్కారం



కక్షిదారులకు పులిహోర పెడుతున్న నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 3,154 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. ఇందులో సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంక్ ప్రిలిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకున్నారని చెప్పారు. కొత్తగూడెంలో మొత్తం 1,710, ఇల్లెందులో 119, భద్రాచలంలో 1,164, మణుగూరులో 113 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. లోక్ అదాలత్ సందర్భంగా కొత్తగూడెం కోర్టులో కక్షిదారులకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ఘనంగా పూజలు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బల ప్రదర్శనకు రెడీ..



కొత్తగూడెం సింగరేణి స్టేడియంలోని సభా వేదికపై ఏర్పాట్లు చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సీపీఐ సభ

- కొత్తగూడెం నుంచి పోటీ చేయాలనే పట్టుదల
- బరిలో ఉంటామని ఇప్పటికే స్పష్టం చేసిన కూనంనేని
- నేడు లక్ష మందితో 'ప్రజాగర్జన'

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కార్మికులు, కర్షకుల్లో తనకున్న పట్టును ప్రత్యక్షంగా చూపేందుకు రంగం సిద్ధం చేసింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రజాగర్జన పేరుతో లక్ష మందితో కొత్తగూడెంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. తద్వారా ప్రజలకు తమ భావజాలాన్ని చేరువ చేయడంతో పాటు ఇతర పార్టీలకు తమ బలమెంతో చూపించనుంది.

కొత్తగూడెంపై ఫోకస్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు ఇటీవల ఎన్నికైన తర్వాత ఆ పార్టీలో మునుపటి దూకుడు కనిపిస్తోంది. ముఖ్యంగా ఎన్నికలకు సంబంధించి క్లియర్ రూట్‌మ్యాప్‌ను రెడీ చేసుకుంది. మతతత్వ బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని కూనంనేని పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో తమతో కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికల్లో పొత్తులు పెట్టుకునేందుకు రెడీ అన్నారు. పొత్తుల విషయంలో అడుగులు ముందుకు పడాలంటే ముందుగా కొత్తగూడెం సీటుపై క్లారిటీ రావాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. కొత్తగూడెంలో సీపీఐ కచ్చితంగా బరిలో ఉంటుందని, ఈ అంశం మీద స్పష్టత వచ్చిన తర్వాతే పొత్తుల ముచ్చటలో మాటలు ముందుకు సాగుతాయని పదేపదే ప్రకటిస్తూ వస్తున్నారు. అయితే ఇటు బీఆర్‌ఎస్, అటూ కాంగ్రెస్ కొత్తగూడెం సీటును వదులుకునేందుకు సుముఖంగా లేవనే భావన రాజకీయ పక్షాల్లో నెలకొంది.

సత్తా చాటేందుకే 'గర్జన'..

సింగరేణి ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో కార్మిక సంఘాలకు, వాటిని నడిపించే వామపక్ష పార్టీలకు ఆది నుంచీ బలమెక్కువ. ముఖ్యంగా సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీ (సింగరేణి కోల్‌మైన్స్ వర్కర్స్ యూనియన్) దశబ్దాల పాటు కొత్తగూడెం గడ్డపై తన హవా కొనసాగించింది. తెలంగాణ ఉద్యమం మొదలయ్యే వరకు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీదే పైచేయిగా ఉండేది. సుదీర్ఘ కాలం టీడీపీతో ఉన్న పొత్తు కారణంగా కొత్తగూడెం అసెంబ్లీ సీటును టీడీపీకి వదిలేది. ఇల్లెందు, అప్పటి బూర్గంపాడు (పినపాక) నుంచి సీపీఐ బరిలో ఉండేది. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీడీపీతో కూడిన మహాకూటమి తరపున కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. అప్పటి నుంచి ఇక్కడ సీపీఐ బరిలో ఉంటోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొత్తగూడెం నుంచి బరిలో ఉండాల్సిందే అని సీపీఐ చెబుతోంది.

'గూడెం' నుంచే ఎక్కువ జనసమీకరణ..

ప్రజాగర్జన సభ విజయవంతం చేయడం ద్వారా ఎన్నికల పొత్తుల అంశంపై కొత్తగూడెం విషయంలో తమ వాదనలు గట్టిగా వినిపించే అవకాశం ఉంటుందనేది సీపీఐ వ్యూహంగా ఉంది. దీంతో లక్ష మందితో నిర్వహించే ప్రజాగర్జన సభకు ఒక్క కొత్తగూడెం నియోజకవర్గం నుంచే 30 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ మేరకు కొత్తగూడెం, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతీ ఇంటి నుంచి సభకు జనాన్ని తరలించేలా ఎర్రదండు శ్రమిస్తోంది. ఎన్నికల ప్రచారం తరహాలో బహిరంగ సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఉత్తమ విద్య, క్రమశిక్షణకు చిరునామా... మన విద్యాలయాలు

ఏజెన్సీలో 'లిటిల్ ఫ్లవర్స్' జైత్రయాత్ర

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏజెన్సీలో విద్యావ్యాప్తికి లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు ఎంతగానో దోహదం చేస్తున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు, మాగంటి రమేష్‌బాబు తెలిపారు. ఏజెన్సీలో విద్యావ్యాప్తి లక్ష్యంగా మాగంటి సూర్యం ఈ విద్యాసంస్థలను భద్రాచలంలో నెలకొల్పారని, ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాల్లో నిలిపిన ఘనత తమ సంస్థలకు దక్కిందని చెప్పారు. ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులను కైవసం చేసుకుని ఏన్నోసార్లు జైత్రయాత్ర కొనసాగించామని తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తుండడం వల్లే ఈ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు తమ విద్యాసంస్థల వైపే చూస్తున్నారని చెప్పారు. తమ బిడ్డల భవితవ్యానికి ఇదే మార్గమని నమ్ముతున్నారని, అపార అనుభవం గల అధ్యాపకులు, ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని వివరించారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి మార్కులతో సంచలనం సృష్టించి భద్రాచలంలో నంబర్ వన్‌గా నిలిచామని, ఈ విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ అనుదీప్ వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శనివారం ఆయన ఐడీఓసీ నుంచి పరీక్ష నిర్వహణపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణ సిబ్బంది ఆదివారం ఉదయం 7.30 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో ప్రతి అరగంటకు ఒకసారి బెల్ కొట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పరీక్షకు పటిష్ట భద్రత : ఎస్పీ

కొత్తగూడెంటౌన్: గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. శనివారం ఆయన పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం, పాల్వంచల ఏర్పాటు చేసిన 22 పరీక్ష కేంద్రాల్లో 8,851 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బంది అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటించాలని ఆదేశించారు. కేంద్రాల చుట్టూ 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమిషం నిబంధన అమలులో..

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగే గ్రూప్ - 1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రలో 682 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి పంపిస్తామని, 10:15 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అయినా అనుమతించేది లేదని నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులు షూ వేసుకుని రావద్దని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

అంబేద్కర్ ఐటీఐకి అపూర్వ ఆదరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి మేదరబస్తీలోని అంబేద్కర్ ఐటీఐని 1992లో దొరై స్వామి స్థాపించగా, 30 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ 30 ఏళ్లలో అంబేద్కర్ ఐటీఐలో వేలాది మంది విద్యార్థులు చదువుకొని ఉద్యోగాలు సంపాదించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కేటీపీఎస్, సింగరేణి వంటి సంస్థలలో ఉద్యోగావకాశాలు పొంది ఐటీఐ పేరు, ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేశారు. వీటితో పాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం వంటి ప్రాంతాలలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు అంబేద్కర్ కళాశాల కరస్పాండెంట్ వెలన్‌కుమార్ మంచి బాటలు వేస్తుండడంతో, ఈ ఐటీఐలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు 'రాధికా కాన్సెప్ట్'

మణుగూరు రూరల్ : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు తమ పాఠశాల ముందంజలో ఉంటుందని రాధికా కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం తెలిపింది. 2010లో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటైన రాధికా కాన్సెప్ట్ స్కూల్.. నాటి నుంచి మెరుగైన, నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. 13 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులు పలు రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తోంది. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించి ఖ్యాతిని సంపాదించుకుంది. 13 సంవత్సరాలుగా పినపాక మండల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన రాధికా కాన్సెప్ట్ స్కూల్ మరో ముందడుగు వేసి మణుగూరు మండలం రాజీవ్‌గాంధీనగర్‌లో నూతన బ్రాంచ్ ప్రారంభానికి రంగం సిద్ధం చేస్తోంది. ఏసీ క్యాంపస్‌తో విశాలమైన తరగతి గదులు, క్రీడా ప్రాంగణంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో రాధికా స్కూల్ ఉందని యాజమాన్యం తెలిపింది. వీటితో పాటు అధునాతన కంప్యూటర్, మ్యాథ్స్, సైన్స్, లాంగ్వేజ్ ల్యాబ్‌లతో పాటు ఫన్ జోన్, శానిటైజ్డ్ టాయ్స్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సీసీ టీవీ సర్వేలెన్స్, స్కూల్ బస్, జీపీఎస్ ట్రాకింగ్, మినరల్ వాటర్ ప్లాంట్ వంటి సౌకర్యాలు ఉన్నాయని వివరించింది. మణుగూరు ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలను రాధికా స్కూల్‌లో చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరింది.

మందుపాతర స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ప్రధాన రహదారిపై పోలీసు బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరను పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. జిల్లాలోని ఆవుపల్లి-బాసగూడ మార్గంలో దుర్గగుడికి సుమారు 25 మీటర్ల దూరంలో మావోయిస్టులు ప్రధాన రహదారి కింద భాగంలో 3 కిలోల శక్తివంతమైన మందుపాతరను ఏర్పాటుచేశారు. బీజాపూర్, సుకుమా, దంతెవాడ, బస్తర్, నారాయణపూర్ తదితర జిల్లాల్లో రోడ్ల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్న క్రమంలో ఆవుపల్లి-బాసగూడ ప్రధాన రహదారిపై కూడా తనిఖీలు చేపట్టారు. దీంతో మావోయిస్టులు అమర్చిన మందుపాతరను సీఆర్‌పీఎఫ్ బలగాలు నిర్వీర్యం చేశాయి.

శిక్ష పడాలంటే సాక్షుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: గత ఏడాది నవంబర్‌లో చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబోడు గ్రామ శివారులో జరిగిన ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు హత్య కేసులో నిందితులకు శిక్ష పడాలంటే దానికి సంబంధించిన సాక్షుల పాత్ర కీలకమని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. శనివారం ఫారెస్ట్ రేంజర్ హత్య కేసులో సాక్షులుగా ఉన్న ఎనిమిది మంది ఆయన్ను కలిసిన సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం ఈ హత్య కేసు న్యాయస్థానంలో ట్రయల్‌కు వచ్చిందని, సాక్షులందరూ మనోధైర్యంతో సాక్ష్యం చెప్పి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

అశ్వాపురం: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై నిరుపేద గిరిజన కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది. మండల పరిధిలోని కొమ్ముగూడెంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొందరు రైతులు పొలాల్లో చెత్త కాల్చేందుకు నిప్పు వేయగా.. గాలికి సమీపంలోని కుర్సం రాంబాబుకు చెందిన గడ్డివామికి మంటలు అంటుకున్నాయి. గడ్డివామి దగ్ధమై పక్కనే ఉన్న చాప పాపారావు పూరిల్లుపై పడి మంటలు వ్యాపించాయి. పాపారావు, అతని భార్య పొలం నుంచి వచ్చి భోజనం చేసేందుకు సిద్ధమవుతుండగా మంటలు వ్యాపించడంతో ఇంట్లోంచి బయటకు వచ్చారు. వారి పూరిల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, సామాన్లు, వ్యవసాయ పనిముట్లు, బంగారంతో పాటు రూ.5 వేల నగదు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కుర్సం రాంబాబుకు చెందిన పాక కూడా కాలిపోయింది. అయితే పాపారావు కుటుంబం మాత్రం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలింది. తహసీల్దార్ ఎంఏ.రాజు, సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ రాజేశ్వరరావు ప్రమాద స్థలానికి వచ్చి నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని ప్రకటించిన రెవెన్యూ అధికారులు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందజేశారు. ఎంపీపీ ముత్తినేని సుజాత రూ.5 వేలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్ రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇంటి నిర్మాణానికి కూడా తనవంతు సాయం చేస్తానని సత్యప్రకాష్ చెప్పారు.



బాధితులతో తహసీల్దార్, సీఐ తదితరులు

గెలల ధరపై కేంద్ర ఫార్ములా వద్దు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలల ధరపై కేంద్ర ప్రభుత్వ ఫార్ములా వద్దని స్థానిక పామాయిల్ రైతు సంఘం బాధ్యులు అన్నారు. మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ నర్సరీలో శనివారం జరిగిన సమావేశంలో ఆయిల్‌పామ్ సొసైటీ బాధ్యులు తుంబూరు మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఆయిల్‌ఫెడ్ అనుసరిస్తున్న ఫార్ములానే రైతులకు మేలు చేస్తుందన్నారు. కేంద్రం మద్దతు ధరగా రూ.13, 346 ఇచ్చేందుకు ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకోవద్దని, దీంతో రైతులకు తీరని నష్టం జరుగుతుందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్ డీఓ ఆకుల బాలకృష్ణ, పామాయిల్ రైతులు ఆలపాటి ప్రసాద్, బండి పుల్లారావు, కోటగిరి సీతారామస్వామి, శీమకుర్తి వెంకటేశ్వరరావు, కాసాని చంద్రమోహన్, నిర్మల పుల్లారావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, తలసిల ప్రసాద్, తాడేపల్లి రవి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో నివాసం ఉండే శ్రీశరణ్ అనే వ్యక్తికి సంబంధించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 6వ తేదీన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. తెల్లవారి ఉదయం చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. బంధుమిత్రుల నుంచి కూడా సమాచారం లేకపోవడంతో చోరీకి గురైనట్లు గ్రహించిన శ్రీ శరణ్.. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై...

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదైంది. బాధితుడి తలకు తీవ్రంగా గాయమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన వేముల సతీష్.. తన బంధువు, భగవాన్ దాస్ కాలనీకి చెందిన వాసుకి వెళ్లాడు. అక్కడ వాసుకి, అతని తండ్రి వెంకన్నకు మధ్య ఓ విషయంలో వాగ్వాదం మొదలైంది. అది తీవ్ర స్థాయికి చేరడంతో సతీష్ వెళ్లి వారిరువురినీ నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అడ్డుగా వెళ్లిన సతీష్‌ని వాసు నోటికి వచ్చినట్లు తిట్టి, దాడి చేశాడు. ఆ సమయంలో సతీష్ తలపై బలమైన గాయం కావడంతో స్థానిక ఆస్పత్రితో ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన సతీష్ భార్య వేముల చంద్రకళ ఫిర్యాదు చేయగా.. వాసుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి..

అశ్వారావుపేటరూరల్: ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై కోతులు దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం మండలకేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని గెస్ట్ హౌజ్ బజారుకు చెందిన వెలుగు రెబ్బామ్మ అనే వృద్ధురాలు ఇంటి అరుగుపై కూర్చొని ఉండగా.. కోతులు ఇంట్లోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలేందుకు వెళ్లిన వృద్ధురాలిని మూకుమ్మడి కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కోతులను తరిమి ఆస్పత్రికి తరలించారు. కాగా, గత కొంతకాలంగా ఇదే ప్రాంతంలో ఉన్న చింత చెట్లపై కోతులు నివాసం ఉంటూ వచ్చిపోయే వారిపై దాడి చేస్తున్నాయి. గత నాలుగు రోజుల క్రితం బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచాయి. కోతులను నివారించాలని పలుమార్లు పంచాయతీ బాధ్యులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు ఈఓ హరికృష్ణకు విలేకరుల ముందే ఫోన్ చేయగా స్పందించలేదు.

పోలీసుల అదుపులో నిందితుల వాహనం ?

సుజాతనగర్: సంచలనం సృష్టించిన సుజాతనగర్ నగల దుకాణంలో చోరీ కేసుకు సంబంధించి నిందితులు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. చోరీ అనంతరం దుండగులు కారులో ఉడాయించిన విషయం విదితమే. వారు హైదరాబాద్ నుంచి కారులో వచ్చి చోరీ అనంతరం తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో ఆ వాహనం ఇచ్చి వెళ్లిపోయారు. కాగా పోలీసులకు లభించిన ఆధారాలను బట్టి హైదరాబాద్‌లో కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితులకు వాహనం ఇచ్చిన వ్యక్తితో పాటు, నిందితుల బంధువుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే చోరీ చేసిన బంగారంతో ఓ వ్యక్తి నేపాల్ పారిపోయినట్లు తెలుస్తోంది. అతడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీ మొట్లగూడెం గ్రామానికి చెందిన అరెం ప్రసాద్ (30) పురుగుల ముందు సేవించి శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా కుటుంబంలో తగాదాలు రావడంతో మనస్థాపానికి గురైన ప్రసాద్ గురువారం రాత్రి పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రసాద్ భౌతికకాయంపై జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

వరకట్న వేధింపులతో మహిళ...

అశ్వాపురం: మండల పరిధిలోని పాములపల్లి గ్రామానికి చెందిన వివాహిత కణితి దివ్య(20) శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది.భార్య, భర్తల తగాదాలతో మనస్థాపం చెందిన దివ్య.. శనివారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న దివ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఆరు నెలల బాబు ఉన్నాడు. భర్త, అత్త, మామల వరకట్న వేధింపులతోనే దివ్య ఆత్మహత్య చేసుకుందని దివ్య బంధువుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అశ్వాపురం పోలీసులు భర్త కణితి శ్రీకాంత్, అత్త, మామలు కణితి విజయలక్ష్మి, రాములు, శ్రీలతపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బూర్గంపాడు: సారపాక సమీపంలోని గోదావరి బ్రిడ్జి కింద ఇసుకలో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లకు పైన ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి శవపంచనామా నిమిత్తం తరలించారు. వడదెబ్బతో మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

క్లుప్తంగా...

భారతీయ మూలాలు నేటి తరానికి ఎంతో అవసరం

సనాతన సంప్రదాయాలతో యువతరాన్ని తీర్చిదిద్దాలి: తమిళిసై



మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మన భారతీయ మూలాలు, సనాతన సంప్రదాయాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం పెద్దలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. భారతీయత– అమృతకాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద్గురు శివానందామూర్తి ఆశీస్సులతో సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయనీ అలాంటి మన మూలాలు నేటి తరానికి దూరం కాకుండా వారికి చేరువ చేయాలన్నారు. మన జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనీ, ఇలాంటి తరుణంలో మన పూర్వీకులు పాటించిన ఆధ్యాత్మికత, ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను యువతరానికి అందించాలని సూచించారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత వైస్ అడ్మిరల్ రామన్ పూరి మాట్లాడుతూ మన భారతీయతను భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థిని రచించిన 'పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినకపాణి సంగీత నిధి'పుస్తకాన్ని ఆవిష్కరించారు.

23 మందితో తెలుగు మహిళ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు మహిళ రాష్ట్ర కమిటీలో 23 మందికి చోటు కల్పించారు. వీరికి శనివారం తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భవనం షకీలా రెడ్డి ఇప్పటికే నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధనకాడ్ రాధిక (నల్గొండ పార్లమెంటు), అధికార ప్రతినిధిగా లక్ష్మి (నల్లగొండ పార్లమెంటు)తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 15 మంది కార్యదర్శులు కొత్తగా నియమితులయ్యారు.

ఉద్దానానికి ఊపిరి

కిడ్నీ వ్యాధికి శాశ్వతంగా చరమగీతం పాడేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

రూ.700 కోట్లతో చేపట్టిన మంచి నీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

- ఖర్చుకు వెనకాడకుండా ఏడాది పొడవునా నీటి సరఫరాకు ప్రాధాన్యత
- 100 కి.మీ దూరంలోని హీరమండలం నుంచి నీటి తరలింపు
- నదుల కింద, కొండలను తొలిచి భూగర్భ పైపులైన్ నిర్మాణం
- మొత్తంగా 1047 కి.మీ పొడవునా భూగర్భ పైపులైన్

గ్రౌండ్ రిపోర్ట్



మెలియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు

ఉద్దానం ప్రాంతం నుంచి మేడికొండ కోటిరెడ్డి, వడ్డే బాలశేఖర్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడి అల్లాడుతుంటే గత ప్రభుత్వాలు మాటలతో మభ్యపెడితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు ఫలితాలివ్వడానికి సిద్ధమయ్యాయి. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్య పరిష్కరించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభోత్సవ దశకు చేరింది. హీరమండలం నుంచి తాగునీటిని తరలించే ప్రక్రియలో ఉపయోగించే నీటి మోటార్లకు మూడు, నాలుగు రోజుల్లో ట్రయల్ రన్ మొదలవ్వనుంది.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం

ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ఉంది. ప్రజల్లో కూడా ఇదే విషయమై ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు కూడా ఆ ప్రాంతంలో కొన్ని మంచినీటి పథకాలు ఉన్నా.. అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. మరోవైపు.. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, వేసవిలో ఆ నదులు ఎండిపోతే ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కన పెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా సరే వెనుకాడకుండా హీరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా నీటి అవసరానికి ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరే అవసరం ఉంటుంది. హీరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 2.67 టీఎంసీలు ఉండటం వల్ల ఉద్దానం ప్రాంతానికి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జగన్ ప్రభుత్వ 'భగీరథ'యత్నం

హీరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటి తరలింపు ఆషామాషీ కాకపోయినా ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో ఏకంగా 1,047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేశారు. రోజూ 8.40 కోట్ల లీటర్ల మేర తాగునీరు ఆ భూగర్భ పైపు లైను ద్వారా వెళ్లేలా పనులు చేపట్టారు. కేవలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ మోటార్లు ఒక్కొక్కటి నిమిషానికి 28 వేలకు పైగా లీటర్ల నీటిని పంపింగ్ చేయగలవు. ఈ నీరు ఎగుడు దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుంటూ.. మధ్యలో మరే మోటార్ల అవసరం లేకుండా 32 కిలోమీటర్ల దూరంలోని మిలియపుట్టి శుద్ధి కేంద్రానికి చేరతాయి. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి మూడో మోటార్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అర కిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల కొండలను తొలిచి పైప్‌లైన్ వేశారు. ఒక్కసారిగా 73 మీటర్ల ఎత్తుకు.. ఆపై 50 మీటర్లు దిగువకు.. మళ్లీ 147 మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి.. మళ్లీ దిగువకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మరో మాటలో చెప్పాలంటే భగీరథ యత్నమే చేశారు.

కరోనా లేకుంటే ఇప్పటికే అందుబాటులోకి..

ఉద్దానం ప్రాంతంలో కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని గ్రామాల పరిధిలో కిడ్నీ సమస్య ఉంది. ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. ఆ ప్రాంత ప్రజలు తాగునీటి అవసరాలకు అక్కడి భూగర్భ జలాలు వినియోగించడం ఒక కారణం కావొచ్చనే నిపుణుల అనుమానాల మేరకే జగన్ ప్రభుత్వం నివారణ చర్యలు మొదలుపెట్టింది. సురక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఈ మంచినీటి పథకానికి సీఎం జగన్ 2019 సెప్టెంబర్ 6న శంకుస్థాపన చేశారు. తర్వాతి సంవత్సరంలోనే కరోనా వ్యాప్తి మొదలైంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విధింపు, మరుసటి ఏడాది కూడా రెండో దశ కరోనా వ్యాప్తి కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. ఈ ప్రభావం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపైనా పడింది. ఈ సమస్య లేకుంటే ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేది.

బాబు, పవన్.. మాటలతోనే సరి

గత చంద్రబాబు ప్రభుత్వం ఉద్దానం సమస్య పరిష్కారం పూర్తిగా పక్కన పెట్టిందనే చెప్పాలి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాల పాటు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్క చర్యా చేపట్టలేదు. చివరి ఏడాది 2018లో కేంద్ర పరిశోధన సంస్థ ఐసీఎంఆర్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలతో ఉద్దానం కిడ్నీ సమస్యపై పూర్తి స్థాయి అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. అది కూడా ప్రకటనకే పరిమితమైంది. అప్పట్లో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ 2018 మే లో ఒకట్రెండు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో దీక్షలంటూ హడావుడి చేశారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒకసారి సమావేశమై ఆ సమస్యను పూర్తిగా వదిలేశారు.

కన్నకొడుకే కాలయముడా..?

- భద్రాద్రి జిల్లా సారపాకలో వ్యక్తి దారుణహత్య
- పెద్దసుత్తితో తలపై కొట్టి చంపిన వైనం
- డ్రగ్స్‌కు బానిసైన కుమారుడిపైనే అనుమానం



రఫీ (ఫైల్)

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం అర్ధరాత్రి ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడైన సయ్యద్ రఫీ(38) ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. ఈ కేసులో రఫీ కుమారుడి(15)పైనే పోలీసులు అనుమానిస్తున్నారు. రఫీకి, భార్య జీనత్‌కు మధ్య కుటుంబ కలహాలున్నాయి. వీరి కుమారుడు 9వ తరగతిలో చదువు మానేశాడు. ఏడాది కాలంగా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఇంట్లో తండ్రితో గొడవపడుతుండేవాడు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు శుక్రవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇన్ని రోజులు ఎక్కడికెళ్లావని తండ్రి నిలదీయగా, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శుక్రవారం ఐటీసీ డ్యూటీకి వెళ్లి వచ్చిన రఫీ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో అతని కొడుకే పెద్ద సుత్తితో మోది హత్య చేశాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టగా హత్యకు ఉపయోగించిన పెద్ద సుత్తి మోతె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలతో ఉన్న రఫీ కుమారుడు దుస్తులను కూడా పోలీసు జాగిలాలు గుర్తించాయి. దీంతో రఫీ కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, తన అన్నను ఆయన కుమారుడు, భార్య కలసి హత్య చేశారని మృతుడి సోదరుడు సయ్యద్ బాజీబాబా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం

రూ. 41.31 లక్షల విలువైన 1,519 బస్తాల పత్తి దగ్ధం



ఖమ్మం మార్కెట్‌లో దగ్ధమవుతున్న పత్తి నిల్వలు

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి యార్డులోని షెడ్డులో నిల్వ ఉంచిన ఓ ట్రేడర్ గ్రూపునకు చెందిన 1,519 బస్తాల పత్తి ఈ ఘటనలో అగ్నికి ఆహుతైంది. ఈ పత్తి విలువ రూ.41.31 లక్షలు ఉంటుందని అంచనా. శ్రీశివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని షెడ్డులో నిల్వ చేయగా శనివారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. సిబ్బంది స్పందించి 290 బస్తాలను బయటకు లాగేసినప్పటికీ, 1,519 బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పత్తి క్వింటాకు రూ.6,800 చొప్పున లెక్కించి రూ.41,31,680 విలువైన పత్తి అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని అధికారులు వెల్లడించారు. షెడ్డులో నిల్వ చేసిన పత్తి బస్తాలకు నిప్పు ఎలా అంటుకున్నదీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదం జరిగిన షెడ్డు వైపు సీసీ కెమెరాలు లేకపోవటంతో కారణాలు గుర్తించలేకపోతున్నారు. కాగా, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాన్ని కొద్ది నెలల క్రితం ఖమ్మం మార్కెట్‌కు కేటాయించారు. కానీ మే నెలలో మార్కెట్‌కు వేసవి సెలవులు ప్రకటించగా యంత్రాన్ని తిరిగి నేలకొండపల్లి పంపించారు. ఈనెల 6న మార్కెట్ పునఃప్రారంభమైనా యంత్రాన్ని రప్పించలేదు. ఖమ్మం, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

జిల్లా వార్తలు

ఘనంగా శ్రీ బాలాజీ కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. శ్రీ స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

రైల్వే టికెట్లు దొరికితే అప్పగించండి

కొత్తగూడెంఅర్బన్: మణుగూరు స్టేషన్‌లో రైల్వే టికెట్లు(ప్రింట్ కానివి) ఉన్న బాక్స్‌ను ఈనెల 8న గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈమేరకు బాక్స్‌ను కొత్తగూడెం లేదా మణుగూరు స్టేషన్లలో అప్పగించాలని ఓ ప్రకటనలో సూచించారు. ఆ బాక్స్‌లోని ఖాళీ టికెట్లపై నంబర్ల ఆధారంగా ఉన్నతాధికారులు ధరలు నిర్ణయించారని తెలిపారు. బాక్స్ అప్పగించిన రివార్డు అందజేస్తామని పేర్కొన్నారు.

మార్కెట్ ఉద్యోగులకు పదోన్నతి

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్ల లో సహాయ కార్యదర్శులు, అకౌంటెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు గ్రేడ్–3 కార్యదర్శులుగా, సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 29మంది పదో న్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేయగా ఉమ్మడి ఖమ్మంలో నలుగురికి జాబితాలో స్థానం దక్కింది. ఖమ్మం మార్కెట్ సహాయ కార్యదర్శి నిర్మలను భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, ఎన్.రాజేంద్రప్రసాద్‌ను మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, కల్లూరు సహాయ కార్యదర్శి తాడేపల్లి కిరణ్‌కుమార్‌కు భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, వైరా సహాయ కార్యదర్శి వి.నాగేశ్వరికి మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా పదోన్నతి కల్పించి నేలకొండపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. త్వరలోనే సీని యారిటీ ఆధారంగా సూపర్‌వైజర్లకు సహాయ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించే అవకాశముందని సమాచారం.

పరిపాలనా వికేంద్రీకరణతో సుస్థిర పాలన

సుపరిపాలనా దినోత్సవంలో ప్రభుత్వ విప్ రేగా



మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు, పక్కన ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజల వద్దకు పాలన చేరిందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఐడీఓసీలో నిర్వహించిన సుపరిపాలనా దినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల వికేంద్రీకరణ అనంతరం నేడు సుస్థిరమైన పాలనతో పోలీసింగ్, శాంతిభద్రతలో ఆదర్శంగా నిలుస్తున్నామని, రిజిస్ట్రేషన్లు తహసీల్‌లో జరుగుతున్నాయని తెలిపారు. అలాగే కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల మనోభావాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పాలన సాగుతున్నదని వ్యాఖ్యానించారు. అదేవిధంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. తెలంగాణలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో వ్యవసాయ రంగం పండుగలా మారిందని, ఆయిల్‌పామ్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామని తెలిపారు. ధరణి ఏర్పాటుతో చర్ల, అశ్వాపురం మండల గిరిజన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. 25 ఎకరాలలో నిర్మించుకున్న ఐడీఓసీ ప్రజల గొంతుకని, ఈ భవనం ప్రజాసమస్యలకు పరిష్కార వేదికని అన్నారు. తొలుత విప్ రేగా, ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ తదితరులు కలిసి జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం జాతీయస్థాయిలో ఆరోగ్య పంచాయతీ విభాగంలో ప్రథమస్థానం సాధించిన గౌతంపూర్ పంచాయతీ సర్పంచ్ పి.సుజాత, కార్యదర్శి షర్మిలను సత్కరించారు. అంతేకాక సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన చిన్నారులను అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమం ప్రారంభంలో వికేంద్రీకరణ పరిపాలనా సంస్కరణలు, ఫలితాలను జిల్లా ప్రణాళికాధికారి చదివి వినిపించగా.. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, శాఖల అధికారులు వికేంద్రీకరణ ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పీపుల్స్ మార్చ్'కు బ్రహ్మరథం

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



కేక్ కట్ చేస్తున్న పొదెం వీరయ్య, నాయకులు

భద్రాచలం: కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చెప్పారు. పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో గత 86 రోజులుగా భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను తెలుసుకోవడానికి మండుటెండలు, వర్షాలను సైతం లెక్క చేయకుండా యాత్ర కొనసాగిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సంస్థాగతంగా ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిరెల రవికుమార్, నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, రేళ్ల వెంకటేష్, చింతిరెల సుధీర్, అంబటి మణికంఠ, బాలబద్రి మని, నాగరాజు, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గిరిజన సంబరాలు



మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్ రాజ్

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ పాఠశాలలు ఈ నెల 12 నుంచి పునఃప్రారంభం కానున్నందున ప్రతీ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సహా మొదటి రోజు పాఠశాలలకు వచ్చే విధంగా చూడాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్, ఇన్‌చార్జ్ ఆర్సీఓ గురుకులం, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డేవిడ్ రాజు సంబంధిత హెచ్‌ఎంలను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో జూమ్ మీటింగ్‌లో సమీక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు విద్యాలయాల్లో గిరిజన సంబరాలు తప్పనిసరిగా జరపాలన్నారు. అలాగే 13న తెలంగాణ చరిత్ర గురించి విద్యార్థులకు తెలపాలని, 14న ట్రైబల్ కల్చర్ కార్యక్రమాలు నిర్వహించి పిల్లలకు వ్యాసరచన పోటీలు, 15న విద్యపై పోటీ పరీక్షలు, 16న పిల్లల మేథాశక్తిపై పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. అంతేకాక 17న పాఠశాలల పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు, 18న ఇంగ్లిష్, గణితంలపై క్విజ్ పోటీలు, 19న బాలబాలికలకు పుస్తకాలు, యూనిఫామ్, కాస్మోటిక్స్, మెటీరియల్ పంపిణీ చేయాలని సూచించారు. 20న ఉపాధ్యాయులు, పిల్లలు వారి తల్లిదండ్రులచే ప్రత్యేక కార్యక్రమాలు, 21న ఆరోగ్య రక్షణకు సంబంధించిన పోటీలు, 22న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలోవివిధ కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు నర్సింగరావు, చంద్రమోహన్, గురుకులం ఏఓ కృష్ణార్జున, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకురాలు ప్రమీలబాయ్, సిబ్బంది వీరస్వామి, వెంకటరమణ పాల్గొన్నారు.

రామాలయానికి హుండీ, కూలర్లు వితరణ



కూలర్లు, హుండీ అందజేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సారపాకకు చెందిన వ్యాపారులు శనివారం హుండీ, కూలర్లను వితరణగా అందజేశారు. ఓ పెయింట్ సంస్థ సౌజన్యంతో రూ.40 వేల విలువైన రెండు కూలర్లు, భక్తులు కానుకలు సమర్పించేందుకు రూ.50 వేల విలువైన హుండీను ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఈఓ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, వేగ్నేశ సంస్థ బాధ్యులు శ్రీనివాసరాజు, దాతలు బి.తేజ, మణికంఠ, వేణు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు



ఉల్వనూరు పీహెచ్‌సీ ఉద్యోగులతో డీహెచ్ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: సీఎం కేసీఆర్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కృషితో రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ జీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన అంబులెన్స్ సర్వీస్, మొబైల్ క్లినిక్‌ను కొత్తగూడెంలో శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక పరికరాల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామన్నారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల ప్రజల కోసం జీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యసేవలు అందించడానికి మొబైల్ క్లినిక్‌లో 18 రకాల రక్త పరీక్షలు చేసే ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే, డాక్టర్, నర్సులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు అంజి, జోగరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్వనూరు పీహెచ్‌సీ తనిఖీ..

పాల్వంచరూరల్: మండలంలోని పరిధిలోని ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీహెచ్ డాక్టర్ గడల శ్రీనివాసరావు తనిఖీ చేశారు. డీఎంహెచ్ఓ శిరీషతో కలిసి ఆయన ఆస్పత్రిని పరిశీలించి ఓపీ వివరాలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. వచ్చే నెల నుంచి ఆస్పత్రిలో 24గంటల పాటు వైద్యసేవలు అందించాల్సి ఉన్నందున సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమిస్తామన్నారు. డాక్టర్ తేజశ్రీ, సర్పంచ్ వాసం రుద్ర, ఉద్యోగులు శ్యామల, రాంరెడ్డి, చైతన్య పాల్గొన్నారు. కాగా, ప్రజలకు మరింత సేవ చేయడానికి ఉన్నత పదవిని వదులుకోవడానికైనా సిద్ధమేనని డీహెచ్ తెలిపారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు సేవ చేస్తూనే ఉంటానని చెప్పారు.

ఐడీఓసీలో బ్యాటరీ వాహనం



కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 8 సీట్ల బ్యాటరీ వాహనాన్ని, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ శనివారం ప్రారంభించారు.
- సూపర్‌బజార్(కొత్తగూడెం)